క్లుప్తంగా

షిర్డీ సాయి ప్రేమ మందిరంలో చలివేంద్రం



రామకృష్ణ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న సాయి భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేట శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిరం వద్ద ఆలయ ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ షిర్డీ సాయి ప్రేమమందిరం వద్ద ప్రతి నిత్యం చల్లటి తాగునీరు, ప్రతి గురువారం మజ్జిగ పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. సాయి సేవకులు, భక్తుల సహకారంతో అతి తక్కువ ఖర్చుతో తాటాకులతో పందిరిని నిర్మించిన సోషల్ వర్కర్ గొంతిన రామకృష్ణ కుటుంబ సభ్యులను సాయి సేవకులు సాయి చిత్రపటం అందజేసి ఘనంగా సత్కరించారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేస్తున్న పీడీ శారద

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : మూడు సంవత్సరాలు వచ్చిన ప్రతి చిన్నారినీ అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని ఐసీడీఎస్ పీడీ శారద కోరారు. గురువారం ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని లంకపేట–2 కేంద్రంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే ప్రతి చిన్నారికీ నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు విద్యాబుద్ధులను కూడా నేర్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సీడీపీ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక వెంకన్న ట్యాంక్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం, చాటపర్రు రోడ్డు ఫీడర్లలో లైన్ షిఫ్టింగ్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏడుకాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లివారి వీధి, మేకవారి వీధి, కబేళ ఏరియా, తూర్పు వీధి శివాలయం ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, ప్రేమాలయం రోడ్డు, పెదమాలపల్లి, తూర్పువీధి, గంగానమ్మగుడి ఏరియా, ఫిల్ హౌస్ పేట, చాటపర్రు రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

సమస్యల నడుమ స్కూళ్లు ప్రారంభం



అసెంబ్లీలో పాల్గొన్న ఏలూరు ఈదర సుబ్బమ్మదేవి పాఠశాల విద్యార్థులు



ఏలూరు ఈదర సుబ్బమ్మ దేవి స్కూలో మూడు తరగతులను కలిపి ఒకే గదిలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు



మొదటి రోజు ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారులు



ఏలూరులో తొలిరోజు కాలేజీకి సైకిల్ పై విద్యార్థులు

- దుమ్ము, ధూళితో తరగతి గదులు
- బురద మయంగా ప్రాంగణాలు
- బయటపడిన నిర్వహణా లోపం
- విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వేసవి సెలవులు ముగిశాయి. విద్యాశాఖ క్యాలెండర్ ప్రకారం గురువారం పాఠశాలలను పునఃప్రాంభించారు. సెలవులను ఆహ్లాదంగా గడిపిన విద్యార్థులు భారంగా, అయిష్టంగా తల్లిదండ్రుల ఒత్తిడితో పాఠశాలలకు బయలుదేరారు. దాదాపు 60 రోజుల విరామం తరువాత పాఠశాలలు తెరవడంతో కొందరు విద్యార్థులు ఉత్సాహంగానే కనిపించారు. తరగతిలో ప్రమోషన్ పొందిన విద్యార్థులు తమకు 2025–26వ సంవత్సరానికి సంబంధించి ఏ తరగతి గదిని కేటాయించారా అనే ఆసక్తి చూపించారు. అయితే పాఠశాలల పునఃప్రారంభానికి సరైన ఏర్పాట్లు జరగలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు పెదవి విరిచారు. కొన్ని పాఠశాలల్లో నిర్వహణా లోపం స్పష్టంగా కనిపించింది. తరగతి గదులన్నీ బూజుతో, బల్లలు దుమ్ము, ధూళితో దర్శనమిచ్చాయి. మరి కొన్ని పాఠశాలల ప్రాంగణాలు మట్టి బురద ఉండి అడుగుపెట్టడానికి వీలులేని పరిస్థితిలు ఉన్నాయి.

20 శాతం లోపే హాజరు

ఏలూరు నియోజకవర్గంలోని కార్పొరేషన్, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలన్నీ గురువారం ప్రాంభించారు. ప్రస్తుతం ఇంకా వేసవి ఎండలు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో చాలామంది తల్లిదండ్రులు తమ బిడ్డలను పాఠశాలలకు పంపడానికి అయిష్టత చూపడంతో విద్యార్థుల హాజరు శాతం 15 నుంచి 20 శాతంలోపే నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులు ఇంకా తమ బంధువుల ఇళ్లకు వెళ్లి తిరిగి రాకపోవడం, మరికొందరు తొలిరోజే ఎక్కువ మంది రారనే ఉద్దేశంతో తరగతులకు హాజరుకాలేదు. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు సెలవుల్లో తాము గడిపిన రోజులను తోటి మిత్రులతో పంచుకుంటూ కనిపించారు. కొందరు విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో తాము నేర్చుకున్న అంశాలను గురించి మిత్రులకు వివరిస్తూ వాటి వల్ల తాము పొందిన వినోదాన్ని చెప్పి ఆసక్తి కలిగించారు.



పాఠశాలలు పునః ప్రారంభంతో ఏలూరు నర్సింహ ఎలిమెంటరీ స్కూల్‌కు వస్తున్న విద్యార్థులు

అరకొరగా హాజరు

పాఠశాలలు పునఃప్రారంభమైనా పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు అరకొరగానే కనిపించింది. ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్ ఉపాధ్యాయులకు బదిలీల కౌన్సిలింగ్ జరుగుతుండడంతో ఎక్కువ మంది ఉపాధ్యాయులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు శాతం కూడా నామమాత్రంగానే కనిపించింది. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు వచ్చినా, విద్యార్థులు తక్కువ మంది హాజరు కావడంతో కొన్ని సెక్షన్లను ఒకే చోట చేర్చి తరగతులు నిర్వహించడం కనిపించింది. కాగా ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయగా విద్యార్థులు భోజనం చేసి మధ్యాహ్నామే ఇళ్లకు తరలివెళ్లారు. పాఠశాలలు తెరిచిన తొలిరోజు హాజరు శాతం తక్కువగానే ఉంటుందని, శుక్ర, శనివారాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని, సోమవారం నుంచి హాజరు శాతం పెరిగే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు, అధికారులు చెబుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న దేగా ప్రభాకర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తూ వందో వార్షికోత్సవంలో అడుగుపెడుతున్న సందర్భంగా మూడేళ్లకు ఒకసారి నిర్వహించుకునే సీపీఐ అంతర్గత మహాసభలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో బాలిన కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం అనేక మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు తమ ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి పోరాడారని తెలిపారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని పట్టించుకోకుండా కార్పొరేట్ల సేవలో తరిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు, అధిక ధరలు వంటి అనేక సమస్యలపై సీపీఐ కార్యాచరణ రూపొందించుకుని ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా రెండో మహాసభలు జూలై 5, 6, 7 తేదీల్లో చింతలపూడిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ నెల 18న ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, మావూరి విజయ, కొండేటి బేబీ, కొల్లూరి సుధారాణి, ఎంఏ హకీం, భజంత్రీ శ్రీనివాసరావు, పాటీలు పెంటయ్య, నాగం అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదాన శిబిరం

ఏలూరు(మెట్రో): ఏలూరు ప్రాంతీయ వ్యాపారం కార్యాలయం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ పి.కాళిదాసు మాట్లాడుతూ రక్తదాన శిబిరం 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో రక్తదానంలో పాల్గొన్నట్టు చెప్పారు. చీఫ్ మేనేజర్ కె.లలిత, ఇంతియాజ్, హెచ్‌ఆర్ మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.


సీసీఎస్ సీఐగా వెంకటేశ్వరరావు



బాధ్యతలు చేపడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

ఏలూరు టౌన్: ఏలూరు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన్ని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ బదిలీ చేశారు. 1996 బ్యాచ్‌కు చెందిన సీఐ వెంకటేశ్వరరావు కేసులను చేదించటంలోనూ, ప్రజలకు సేవలు అందించటంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పాత నేరస్తుల కదలికలపై మరింత పటిష్టమైన నిఘా ఉంచటంతోపాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేసును పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. చోరీ కేసుల్లో ఆస్తి రికవరీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి



తహసీల్దార్‌ను సత్కరిస్తున్న శ్రీను

దెందులూరు: దెందులూరు భవన నిర్మాణ కార్మికులు అనుబంధ సంస్థల సమస్యల పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని రూరల్ మండలం నూతన తహసీల్దార్ జి.విజయకుమార్ రాజు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో భవన నిర్మాణ అనుబంధ సంస్థల ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు, సంఘ రాష్ట్ర సభ్యుడు కాకర్ల శ్రీను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాలువా పూలదండలతో తహసీల్దార్‌ను శ్రీను సత్కరించారు.

పంటల సాగుపై అవగాహన

బుట్టాయగూడెం: కె.అంకంపాలెంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందస్తు ఖరీఫ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం విస్తీర్ణ అధికారి డాక్టర్ వి.దీప్తి అరటి, మినుము, పెసర, వరి పంటల సాగుపై రైతులకు అవగాహన కలిగించారు.

మహిళల భద్రతకు ‘శక్తి’



బ్యానర్‌తో అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

ఏలూరు టౌన్ : జిల్లాలో మహిళలు, బాలికల అత్యవసర పరిస్థితుల్లో భద్రతకు, రక్షణ సహాయానికి శక్తి యాప్‌ను వినియోగించాలని ఏలూరు మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో శక్తి టీమ్ బృందాలు నగరంలోని పార్కులు, బహిరంగ ప్రదేశాలు, జనాలు అధికంగా తిరిగే ప్రాంతాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు ఏదైనా అత్యవసర ప్రమాదకర పరిస్థితి ఎదురైతే వెంటనే 112 లేదా 79934 85111కు కాల్ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అత్యవసర సమయాల్లో ఒక్క క్లిక్‌తో క్షణాల్లోనే పోలీసులు ఘటనా స్థలిలో ఉంటారని తెలిపారు. కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడినా వెంటనే తమకు తెలియజేయాలని కోరారు.

చదివిన పాఠశాలలో హెచ్‌ఎంగా జయకుమార్



జయకుమార్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తాను చదివిన పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా బాధ్యతలు స్వీకరించిన అరుదైన ఘటన నగరంలో చోటు చేసుకుంది. స్థానిక ఆదివారపు పేట ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వీకే జయకుమార్ చదువుకున్నారు. ఈ నెలలో చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఆయన ప్రధానోపాధ్యాయునిగా తాను చదివిన పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల సంఘం నాయకులు ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. జయకుమార్‌ను సత్కరించిన వారిలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఒబిలిశెట్టి బాబురావు, గొంతిన రామకృష్ణ, బోయిన సతీష్, మక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమష్టిగా పని చేయాలి

మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్సీ వంక రవీంద్ర

ఉంగుటూరు: పార్టీలు వేరే అయినా సమస్యలు పరిష్కార దిశగా ప్రజా ప్రతినిధులు కలిసి పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్సీ వంక రవీంద్ర అన్నారు. గురువారం ఉంగుటూరు మండల పరిషత్ సమావేశం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్ర మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ,గ్రామ సభల్లో చేస్తున్న తీర్మానాలు, రికార్డుల మేరకు పనులు జరుగుతున్నాయో లేదో పరిశీలించుకోవాల్సిన బాధ్యత సర్పంచులు, ఎంపీటీసీల మీద ఉందన్నారు. కాకర్లమూడి, నారాయణపురం టూరింగు పేటలో మంచినీళ్ల సమస్య పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామ సమస్యలు రాజకీయాలకు అతీతంగా చూడాలని అపుడే ప్రజల్లో గౌరవం పెరుగుతుందన్నారు. మన హయాంలో ఈ పని గ్రామంలో చేశామనే తృప్తి మనలో మిగలాలని రవీంద్ర అన్నారు. వైఎస్ జగన్ హయాంలో నిర్వహించిన పాఠశాల, సచివాలయ భవనాలు అసంపూర్తిగా ఉన్నా వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని రవీంద్ర అన్నారు. వాటి నిర్మాణాలపై ఒత్తిడి తీసుకొచ్చి పూర్తి అయ్యేలా చేయాలని వివరించారు. ఉంగుటూరు ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ మాట్లాడుతూ మే 31న అనుమతులు పొందిన యర్రచెరవు తవ్వకం పనులు తొమ్మిది రోజులు దాటినా ఇంకా విచ్చలవిడిగా తవ్వుతున్నారని, వాటిపై రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడటం లేదన్నారు. ఎంపీడీవో రాజ్‌మనోజు మాట్లాడుతూ యోగాకు ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో 21న జరగబోయే దానికి ట్రైల్ రన్ కింద 14న గ్రామ సచివాలయాల వద్ద నిర్వహించాలన్నారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ శిరీష, డీఆర్‌డీఏ ఏపీఎం ప్రభావతి, విద్యుత్ ఏఈ వేణు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలక్ష్మి మాట్లాడారు. అనంతరం కాకర్లమూడి ఉప సర్పంచి కూనా రాజు, ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి, చేబ్రోలు సర్పంచి రందే లక్ష్మీసునీత, ఎంపీటీసీ బండారు నాగరాజు, నాచుగుంట సర్పంచి ఏలేటి సునీత పలు సమస్యలపై ప్రశ్నలను లేవనెత్తారు. దీనికి సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు.

మూగ జీవాలకు ట్రస్ట్ సేవలు అభినందనీయం

దెందులూరు: మూగ జీవాలకు చల్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. జంతు హక్కుల పరిరక్షణలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో చల్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ జంతు విభాగం దెందులూరు మండలం సోమవరప్పాడులో చైర్ పర్సన్ చర్లపల్లి శ్రీలత, మిత్ర బృందం విశిష్ట సేవలందిస్తోంది. ఫైట్ ఫర్ యానిమల్స్ నినాదంతో జంతు ప్రేమికులతో కలిసి బృందంగా ఏర్పడి హింసకు గురైన జంతువులను రక్షిస్తున్నారు. కోతులు, కుక్కలు, ఆవులు, పక్షులు జంతువులకు ఆహారం అందించడమే కాక అవి మరణించినప్పుడు ఖననం చేస్తున్నారు. గురువారం సోమవరప్పాడు చల్లపల్లి చారిటబుల్ ట్రస్ట్‌లో చైర్‌పర్సన్ శ్రీలత మాట్లాడుతూ తాను తన మిత్ర బృందం దాదాపు 2 వేల మంది రెండు రాష్ట్రాల్లో 2004లో ఏర్పాటు ట్రస్టు ఏర్పాటు చేశామన్నారు. అప్పటి నుంచి సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పలు రకాల జంతువులు దాదాపు రెండు లక్షలకు పైగా వైద్య సేవలు, అంతిక్రియలు చేశామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

కొయ్యలగూడెం: స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో నిర్మిస్తున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ కోశాధికారి విశ్వనాథ శర్మ గురువారం తెలిపారు. ఫొంగ్రి చిన్న బుజ్జి రూ.50,001, పర్వతనేని శ్రీనివాస్ రూ.11,116 అందజేశారన్నారు. గత ఆలయానికి వెనుక సుమారు రూ.30 లక్షల రూపాయల అంచనాతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి రథయాత్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 13వ తేదీ నుంచి శ్రీ సత్యసాయి సేవా సంస్థలు ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధి శశి శేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రథయాత్ర సందర్భంగా ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, స్వామి వారికి ప్రభాత సేవ కార్యక్రమాలతో పాటు విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. 13, 14వ తేదీల్లో ఉంగుటూరు సబ్ జోన్‌లోని గ్రామాలతో పాటు జంగారెడ్డిగూడెం, పోలవరం సబ్ జోన్లలోని గ్రామాల్లో రథయాత్ర చేస్తామని వివరించారు. 15వ తేదీన జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు సబ్ జోన్‌లోని గ్రామాలు, 16వ తేదీన ద్వారకా తిరుమల, 17న ఏలూరు, కైకలూరు సబ్ జోన్లలోని పలు ప్రాంతాల్లో రథయాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన ఒక యువకుడు స్నేహితులే తనపై కేసు పెట్టారనే మానసిక వేదనతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తంగెళ్లమూడి బోడిదిబ్బ ప్రాంతానికి చెందిన ప్రగడ నాగేంద్ర ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నాడు. నాగేంద్ర తన స్నేహితులైన రాము, సాయితో పాటు ఈనెల 10న రాత్రి వేళ మద్యం తాగాడు. మద్యం మత్తులో స్నేహితులు ఇద్దరూ నాగేంద్రతో గొడవపడ్డారు. మరుసటి రోజు స్నేహితులిద్దరూ ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై తీవ్ర మనస్థాపానికి గురైన నాగేంద్ర గురువారం ఇంటివద్ద ఉరివేసుకోగా అతడ్ని ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తమిళనాడు డీసీపీగా కామవరపుకోట వాసి

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్, కామవరపుకోటకు చెందిన కంభం విజయరాజు తనయుడు ప్రవీణ్ గౌతమ్ తమిళనాడులోని తిరుపూర్ పట్టణానికి డీసీపీగా పదోన్నతి పొందారు. 2020 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన ప్రవీణ్ గౌతమ్ 2023 నుంచి తమిళనాడు రాష్ట్రంలో కన్యాకుమారి ఏఎస్పీగా విధు లు నిర్వహిస్తూ, డీసీపీగా ప్రమోషన్ పొందార ని విజయరాజు గురువారం తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	36	బీర్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	48
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	48	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	24	అల్లం	64
క్యారెట్	36–45	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	26	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	26	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10–15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	09
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	17
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు – తిరుపతి	16.00	4830	32